క్లుప్తంగా

మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ



తెలంగాణ చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివార్లకు రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు.

తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు 250 క్యూసెక్కుల నీరు



కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకీన్స్‌లా నుంచి తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్ (కేసీ కెనాల్)కు 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఆదివారం ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ప్రస్తుతం మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి మాత్రమే పంపుల ద్వారా కేసీ కెనాల్‌లోకి కృష్ణా జలాలను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కాగా లాకీన్స్‌లా వద్ద నిప్పుల వాగు, అలగనూరు రిజర్వాయర్ లకు గేట్లు పూర్తిగా మూసి వేశామని, కేవలం తూడిచెర్ల ఎస్కేప్ ఛానల్‌కు మాత్రమే నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు వివరించారు.

వినాయక మండపం వద్ద విందు భోజనం



దేవస్థానం ఉద్యోగులు ఏర్పాటు చేసిన విందు భోజనం

శ్రీశైలం: క్షేత్రపరిధిలోని దేవస్థానం ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న వినాయకుని విగ్రహం వద్ద నిర్వాహకులు ఆదివారం విందు భోజనం ఏర్పాటు చేశారు. అనేక రకాల పదార్థాలు, పండ్లు, ఫలాలతో పాటు వందలాది మందికి భోజన ప్రసాదాన్ని అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని గంగాల కాలనీలో 16వ వార్డు కౌన్సిలర్ విజయచౌదరి ఆధ్వర్యంలో ఆ కాలనీలోని నిరుపేదలకు ఉచితంగా బియ్యం ప్యాకెట్లతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిలర్ విజయచౌదరి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీలోని కొందరు పేదల ఇళ్లలోకి వర్షపు నీరు వెళ్లడంతో నిత్యావసర సరుకులకు తడిసిపోయాయన్నారు. దీంతో పేదలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వారికి తమవంతు సాయంగా బియ్యంతో పాటు సరుకులు, కూరగాయలు అందించామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో ఇసుకవాగు వంతెన నిర్మాణం



వంతెన నిర్మించనున్న పారుమంచాల ఇసుకవాగు

జూపాడుబంగ్లా: త్వరలో ఇసుకవాగుపై వంతెన నిర్మాణం పనులు ప్రారంభించనున్నట్లు రోడ్లు, భవనాలశాఖ ఏఈ మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత నెల 8న రూ.5కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి ఆర్థికశాఖ మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్ రెడ్డి భూమిపూజ చేశారన్నారు. మూడు మాసాల్లో వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హామీ ఇచ్చారని చెప్పారు. త్వరగా పనులు ప్రారంభించి, వేగవంతంగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాలశాఖ అధికారులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తుండటంతో పక్షం రోజుల్లో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారన్నారు.

వర్షం .. రైతన్నల హర్షం

- నల్లమల అటవీప్రాంతంలో భారీ వర్షం
- పొంగి పొర్లిన వాగులు
- నిండిన చెరువులు.. పెరిగిన భూగర్భ జలాలు





ఆత్మకూరు సమీపంలో పొంగిన భవనాసి, మహానంది వద్ద రోడ్డుపైకి ఎక్కి ప్రవహిస్తున్న పాలేరు వాగు



పాలెంచెరువు గూడెం సమీపంలో వరిపొలాలలో నిలిచిన వర్షపునీరు

ఆత్మకూరు: మండలంలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత ఆగస్టు నెలలో రోజుల తరబడి వర్షాలు కురవకపోగా ఈ నెలలో రెండు వారాలుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మండలంలోని నల్లమల అటవీప్రాంతంలో భారీ వర్షాలు కురిశాయి. ఈ వర్షాలకు నల్లమలలోని భవనాసి, సిద్ధవాగు పొంగి ప్రవహించాయి. మండలంలో శనివారం 77.4 మిమీ. , ఆదివారం 36.2 మిమీ వర్షం కురిసింది. ఈ వర్షాలకు మండలంలోని అన్ని చెరువులు నిండడమే కాకుండ భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉండడంతో పాటు బోరుబావుల్లో కూడా పుష్కలంగా నీరు నిండే అవకాశం ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసే దశలో వర్షాభావ పరిస్థితుల వలన ఇబ్బంది పడ్డ రైతులు రబీ ప్రారంభ సమయంలో వర్షాలు కురవడం ఎంతగానో పంటలకు ఉపయోగపడతాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపల్లి: మండలంలో మళ్లీ వర్షం కురిసింది. మండలంలోని గ్రామాలలో ఆదివారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. మండలకేంద్రమైన కొత్తపల్లితో పాటు గోకవరం, శివపురం, కొక్కెరంచ, ఎర్రమఠం, దుద్యాల గ్రామాలలో 38.6 మి.మీల వర్షపాతం నమోదు అయింది. పొలాలు వర్షపునీటితో నీటికుంటల్లా దర్శనమిస్తున్నాయి. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీకాలనీలో, వీరాపురం ఎస్సీకాలనీలో, కొత్తపల్లి మెయిన్‌బాజారు లో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాములపాడులో 40.6 మిల్లీ మీటర్ల వర్షపాతం

పాములపాడు: మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం 40.6మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. కాగా మండలంలోని పలు వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు తక్కువగా కురవడం రైతులను ఆందోళనకు గురి చేసింది. అడపా దడపా కురిసిన వర్షాలకు వ్యవసాయ బావులు, బోర్లలో నీరు ఉన్నప్పటికీ, రబీ పైర్లకు నీరు కష్టమని భావించిన రైతులకు ఈ వర్షం ఊరట నిచ్చింది. మండలంలోని ఇస్కాల నందీశ్వరాయం వద్ద భవనాశి నది ఉధృతంగా ప్రవహించడంతో ప్రజల రకాపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒడ్డున ఉన్న నందీశ్వరాలయంలోకి నీరు చేరింది. ఈ నీరు సంగమేశ్వరంలోని సప్తనదులలో కలుస్తుంది.

జూపాడుబంగ్లాలో 19.8మిల్లీమీటర్లు..

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కురిసిన వర్షం 19.8మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పాములపాడులో అత్యధిక వర్షపాతం నమోదు కాగా పగిడ్యాలలో అత్యల్పంగా 7.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మిడుతూరులో 12.6ఎం.ఎం, నందికొట్కూరులో 8.4మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసిందన్నారు.

మరోసారి పొంగిపొర్లిన పాలేరు వాగు

మహానంది: మహానంది–గాజులపల్లె మార్గంలోని పాలేరువాగు ఆదివారం మరోసారి పొంగి ప్రవహించింది. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నల్లమలలోని నీరు పాలేరువాగులో చేరుతోంది. మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల సమీపంలో ఉన్న పాలేరు ఉధృతి అధికం కావడంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మహానందీశ్వర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు తెలియక ఈ మార్గంలో వెళ్లి ఇరుక్కుపోగా, కి వీవీఆర్ యూత్ సభ్యులు పాలేరు వాగు వద్దకు చేరుకుని సేవలు అందించారు. ప్రయాణికులను, వారి వాహనాలను సురక్షితంగా దాటించి అందరిచేత మన్ననలు పొందారు.



భక్తులను వాగుదాటిస్తున్న వీవీఆర్ యూత్ సభ్యులు

ఎంపీటీసీలకు సత్కారం

వెలుగోడు: రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న మండల ఎంపీటీసీలను ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తనయుడు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి, పార్టీ నియోజకవర్గం నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డిల సమక్షంలో ఎంపీటీసీలను సన్మానించారు. వారి చేత కేక్ కట్ చేయించి, గజమాలలతో సత్కరించారు. ఎంపీపీ లాలం రమేష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి స్ఫూర్తితో రాజకీయాల్లో వచ్చానని, ఆయన అండదండలతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఈ రెండేళ్లలో దాదాపు రూ.80 లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, వైస్ ఎంపీపీలు చికెన్ బాష, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కార్తీక్‌రెడ్డి, శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

వెలుగోడు: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్ ఈ సారి రాష్ట్రంలోని 175 స్థానాల్లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నారని, పార్టీ శ్రేణులు ఎక్కడా కూడా రాజీ పడకుండా ఆ దిశగా పని చేయాలని పిలుపునిచ్చారు. మీ కుటుంబంలో మంచి చేశా అనిపిస్తేనే వైఎస్సార్‌సీపీకి సపోర్ట్‌గా ఉండాలన్న ఏకైక నాయకుడు వైఎస్ జగనే అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పార్టీ ఏదైనా తారతమ్యాన్ని చూపించకుండా .ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు ప్రజాధనం దోచుకున్నాడు కాబట్టే జైలుకు వెళ్లాడన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని జిమ్మిక్కులు చేసినా నిజం దాగదన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ , సర్పంచ్ వేల్పుల జైపాల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, నంది రెడ్డి గారి రామిరెడ్డి , వైస్ ఎంపీపీలు చికెన్ బాబు, శంకర్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిల్పా కార్తీక్ రెడ్డి

రోడ్డుపైనే గుర్రాలు

- తరచూ ప్రమాదాలు
- గతంలో ఒకరు మృతి, పలువురికి గాయాలు

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందికి నిత్యం వివిధ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అయితే మహానంది సమీపంలోని రహదారిలో గుర్రాలు, గాడిదల సంచారం ఎక్కువ కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. యజమానులు వాటిని ఇష్టానుసారంగా వదిలేయడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా రోడ్డుకు అడ్డంగా ఉంటున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వీటి వల్లే గోపవరం గ్రామానికి చెందిన ఒకరు మృతి చెందాడు. దీంతో పాటు మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల వాహనాలు, సమీప గ్రామాల వారి బైకులు అదుపుతప్పి కిందపడడంతో పదుల సంఖ్యలో గాయపడినవారు ఉన్నారు. అధికారులు స్పందించి గుర్రాలు, గాడిదల యజమానులతో మాట్లాడి రోడ్లపైకి రాకుండా చూడాలని ప్రయాణికులు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మహానంది సమీపంలో రోడ్డుపై సంచరిస్తున్న గుర్రాలు


లింగాలగట్టు వద్ద ట్రాఫిక్‌జాం

శ్రీశైలంప్రాజెక్ట్: లింగాల గట్టు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. లింగాలగట్టు గ్రామంలో మత్స్యకారులు హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారికి పక్కనే చేపలు విక్రయిస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌జాం అవుతోంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు, మత్స్యశాఖ అధికారులు ఎన్నిమార్లు మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ రోడ్లకు ఇరువైపున చేపల విక్రయం కొనసాగిస్తుండడంతో వాహనదారులకు కష్టాలు తప్పడంలేదు. శ్రీశైలానికి శని,ఆది, సోమవారాల్లో భక్తులు తమ వాహనాల్లో భారీగా వస్తుంటారు. చేపల విక్రయంతో లింగాలగట్టులో ట్రాఫిక్ జాం సమస్య పరిపాటిగా మారింది.



పవర్‌హౌస్ నుంచి లింగాలగట్టు వరకు నిలిచిపోయిన వాహనాలు

గృహాలకు మరమ్మతులు చేయించాలి



చెంచుగిరిజనులతో చెంచు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై.ఆశీర్వాదం

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రం అయిన సున్నిపెంటలోని భ్రమరాంబా చెంచుకాలనీలో గిరిజనులకు కట్టించిన ఇళ్లు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని కొమరం భీం చెంచుగిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఆశీర్వాదం ఐటీడీఏ అధికారులను కోరారు. ఆదివారం ఆయన చెంచుగిరిజన కాలనీని పరిశీలించారు. ఎన్నో ఏళ్లక్రితం సుమారు 25 కుటుంబాలకు ఐటీడీఏ అధికారులు ఇళ్లను నిర్మించారని, అవి ఇప్పుడు శిథిలావస్థలో ఉన్నాయని తెలిపారు. ఏ క్షణమైనా కూలిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వీరయ్య, వీరమ్మ, చంద్రమ్మ, వెంకటమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొరటాల ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూరు: సీపీఎం నాయకుడు కొరటాల సత్యనారాయణ ఆశయాలను సాధించాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు రాజశేఖర్ అన్నారు. ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆదివారం కొరటాల సత్యనారాయణ శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భూస్వాముల కుటుంబంలో జన్మించిన కొరటాల సీపీఎం పార్టీకి ఎన్నో సేవలు అందించారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాలుపంచుకున్నారన్నారు. కార్యక్రమంలో రణధీర్, నరసింహనాయక్, రజాక్, సురేశ్, స్వాములు పాల్గొన్నారు.

రబీ సీజన్‌కు రాయితీ శనగ విత్తనాలు

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌కు గాను నందికొట్కూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు 4,100 క్వింటాళ్ల జేజీ 11రకం శనగ విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయశాఖ ఏడీ విజయశేఖర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలానికి 700 క్వింటాళ్లు, పాములపాడు–300, కొత్తపల్లి–250, నందికొట్కూరు–1,400, పగిడ్యాల–350, మిడుతూరు–1,100 క్వింటాళ్ల చొప్పున రాయితీ శనగ విత్తనాలు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో 40 శాతం రాయితీపై రైతులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. శనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

బడుగు, బలహీనవర్గాలు రాజకీయంగా ఎదగాలి

జూపాడుబంగ్లా: బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర, జిల్లా ఇన్‌చార్జ్ లాజరు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ స్వాములు అన్నారు. ఆదివారం ఆ పార్టీ నాయకులు జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం, తర్తూరు గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓటర్లు నోట్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా అభివృద్ధి చేసే నాయకులను చూసి ఓట్లు వేయాలన్నారు. కాసులకు ఆశపడి కుంభకోణాల్లో అడ్డంగా దొరికిపోయిన నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెంచుగిరిజనులకు ఉచిత వైద్యసేవలు

ఆత్మకూరు: మండలంలోని కొట్టాలచెర్వు గూడెంలో సంఘమిత్ర సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసూతి వైద్యాధికారి బాలకృష్ణవేణి, మన్మథ్ గిరిజనులకు వైద్య పరీక్షలు చేశారు. వారు మాట్లాడుతూ గిరిజనులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, సమీపంలోని ప్రభుత్వవైద్యశాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. అనంతరం 170 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సునిత, మాధవి, వసూధరాణి, హరీష, సంఘమిత్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్రీనివాస్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పదవులకు రెండేళ్లు పూర్తి

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల అధ్యక్షులు బుడ్డారెడ్డి యశస్విని, దేరెడ్డి చిన్న సంజీవరెడ్డిల పదవులు చేపట్టి ఆదివారంతో రెండేళ్లు పూర్తయింది. రెండేళ్ల పాటు దిగ్విజయంగా పూర్తి చేసుకున్న రెండు మండలాల అధ్యక్షులను ఎంపీడీఓలు శివనాగజ్యోతి, వాసుదేవగుప్తతో పాటు మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

ముమ్మరంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య దృష్ట్యా గ్రామాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు వైద్యసిబ్బంది ద్వారా నిర్వహిస్తున్నారు. ఆదివారం గువ్వలకుంట్ల సచివాలయం పరిధిలోని జీ.వీరాపురం గ్రామంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, వివిధ రకాల వ్యాధి గ్రస్తులకు రక్త పరీక్షలు, బీపీ, షుగర్, టీబీ పరీక్షలు చేశారు. గ్రామంలో 30 మందికి వివిధ వ్యాధులకు వైద్యచికిత్స చేయించుకునేందుకు టోకన్లు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సరిత, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



వీరాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

శ్రీశైలదేవస్థానం ఉద్యోగుల అంతర్గత బదిలీలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న పలువురు రెగ్యులర్, కాంట్రాక్ట్ , ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 13 మంది అంతర్గత బదిలీలను చేస్తూ ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ప్రధానంగా స్వామివారి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వై.దివాకర్‌రెడ్డిని జి–2, ఎల్–1 సీట్ కు బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ లోకేశ్వరప్పను స్వామివారి టెంపుల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. రికార్డు అసిస్టెంట్ డి.బాలకార్తిక్ గౌడ్ ను డీసీబి విధులకు కేటాయించారు. అలాగే పలువురు జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్ ,అటెండర్, ఒప్పంద సిబ్బంది, డైలీ వేజర్స్ సిబ్బంది మొత్తం 13 మంది సిబ్బందిని అంతర్గతంగా బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరాలని ఈఓ పేర్కొన్నారు.

గణేష్ నిమజ్జనంలో నిర్లక్ష్యం

శ్రీశైలంప్రాజెక్ట్: గణేష్ విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలు అట్టహాసంగా నిర్వహించేందుకు ముందుకు వస్తున్న కమిటీలు నిమజ్జనంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. శ్రీశైలం డ్యామ్ దిగువ భాగంలో లోతుగా నీరు ఉన్న చోట విగ్రహాలను నిమజ్జనం చేయకుండా, గట్టు పక్కనే వేయడంతో ప్రతిమలు మునగకుండా ఒడ్డునే ఉన్నాయి. డ్యామ్‌కు ముందు భాగంలో పెద్ద బ్రిడ్జి వరకు నీరు తక్కువగా ఉన్నప్పటికీ భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో నిత్యం విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండడంతో ఎగ్జిగ్ టన్నల్ ప్రాంతంలో నీరు పుష్కలంగా ఉంది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఆ ప్రాంతంలో గణేష్ ప్రతిమలను నిమజ్జనం చేయకుండా తూతూ మంత్రంగా నది ఒడ్డునే నిర్లక్ష్యంగా నిమజ్జన కార్యక్రమాలు చేశారు.



నది ఒడ్డున నీళ్లలో మునగని గణేషుని ప్రతిమలు

30 నుంచి శౌర్య జాగరణ యాత్ర

నంద్యాల(వ్యవసాయం): విశ్వ హిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర చేపట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ పోలేపల్లి సందీప్ తెలిపారు. ఆదివారం భరతమాత దేవాలయంలో యాత్రకు సంబంధించిన కరపత్రాలు, స్టిక్కర్లను జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. హిందూ యువతలో దేశభక్తి, దైవభక్తి నింపడం, మన ప్రాంతంలోని స్వాతంత్ర్య పోరాట వీరులను నేటి యువతకు గుర్తు చేయడం, మత మార్పిడులు అరికట్టడం, హిందూ కన్యా రక్ష మొదలగు లక్ష్యాల సాధన కోసమే ఈ యాత్ర యోజన చేశారని చెప్పారు. జాగరణ యాత్ర ఈ నెల 30న అహోబిల పుణ్య క్షేత్రం నుంచి మొదలై జిల్లాలోని అన్ని మండలాల్లో యువతను జాగృతం చేస్తూ దాదాపు 60కి పైగా చిన్న, పెద్ద సమావేశాలు నిర్వహిస్తూ అక్టోబర్ 14న నంద్యాలలో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల నగర అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, లింగేశ్వర బాబు, కమ్మయ్య, వరప్రసాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలవికాస్ సేవలు మరువలేనివి

నంద్యాల(వ్యవసాయం): సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలవికాస్ కేంద్రం సేవలు మరువలేనివని ఫౌండేషన్ నగర కన్వీనర్ చింతలపల్లె వాసు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌నగర్ బుడగజంగాల కాలనీలోని తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్టు, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దేవాలయాన్ని పరిశీలించారు. అనంతరం బాలవికాస్ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సనాతన ధర్మం, సంప్రదాయాలను పాటించి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, దేవాలయ పూజారి ఎల్లప్ప, మౌలాలి, సుంకన్న పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



పారుమంచాలలో నిర్మించిన వెయ్యిమెట్రిక్ టన్నుల గోదాము,



తంగడంచలో నిర్మించిన హెల్త్‌క్లినిక్ భవనం

- 1.20కోట్లతో రెండు గోదాముల నిర్మాణం
- రూ.21.80లక్షలతో హెల్త్‌క్లినిక్, ఆర్బీకే భవనాలు
- రూ.40లక్షలతో సచివాలయ నిర్మాణం



జూపాడుబంగ్లాలో నిర్మించిన 500మెట్రిక్ టన్నుల గోదాము



పారుమంచాలలో నిర్మించిన సచివాలయం

జూపాడుబంగ్లా: మండలకేంద్రమైన జూపాడుబంగ్లా, పారుమంచాల, తంగడంచ గ్రామాల్లో రూ.లక్షల నిధులను వెచ్చించి నిర్మించిన భవనాలు, గోదాములు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వచేసుకునేందుకు వీలుగా పారుమంచాలలో రూ.75లక్షలతో వెయ్యిమెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము, జూపాడుబంగ్లాలో రూ.45లక్షలతో 500 మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. పారుమంచాలలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.80లక్షలతో నిర్మించిన ఆర్బీకే, తంగడంచలో రూ.21.80లక్షలతో పూర్తి చేసిన హెల్త్‌క్లినిక్ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగుచేసిన ధాన్యం త్వరలో చేతికందనున్న నేపథ్యంలో గోదాములను ప్రారంభిస్తే గోదాముల్లో నిల్వచేసుకునే వెసలుబాటు ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.